సాక్షి మెదక్

ఆదివారం : 18 : జూన్ : 2023



నాన్నే మా హీరో

నాన్న ప్రోద్బలంతోనే ఈ స్థాయికి చేరామని జిల్లా స్థాయి అధికారులు అన్నారు. ఫాదర్స్ డే సందర్భంగా సాక్షితో వారి మనోభావాలను పంచుకున్నారు. 8లో

ధ్రువపత్రాలకు సర్వర్ కష్టాలు

ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సర్వర్ కష్టాలు తప్పడం లేదు. మీసేవా కేంద్రాల్లో సర్వర్ బిజీ అని చూపడంతో కుల, ఆదాయ, నివాస ధ్రువ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు రోజులతరబడి వేచి చూడాల్సి వస్తుంది. 9లో

పది పరీక్షలకు 45 మంది గైర్హాజరు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో జరుగుతున్న టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. శనివారం జరిగిన పరీక్షకు 504మంది హాజరు కావాల్సి ఉండగా 459 మంది వచ్చారు. 45మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మెదక్, నర్సాపూర్, తూప్రాన్‌లో జరుగుతున్న పరీక్షలను ఫ్లయింగ్‌స్క్వాడ్స్ పరిశీలించినట్లు డీఈఓ రాధాకిషన్ తెలిపారు.

న్యూస్‌రీల్

ఆర్టీసీలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

మెదక్ కలెక్టరేట్: ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మెదక్‌లో ఆమె మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్ల పోస్టులను భర్తీ చేయకపోవడంతో మిగతా ఉద్యోగుల పైనే పని భారం పడుతుందన్నారు. విరామం లేకుండా విధులు నిర్వహించడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి



చిట్కుల్‌లో జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శనివారం చిలప్‌చెడ్, గౌతాపూర్, చండూర్, చిట్కుల్ గ్రామాలలో ఆయన కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. మూడు సార్లు ఎమ్మెల్యే, ఒకసారి చిన్న నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న సునీతారెడ్డి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లలాంటి పథకాలు విజయవంతంగా అమలయ్యాయని తెలిపారు. టీపీసీసీ రాష్ట్ర ప్రతినిధి అంజనేయులు గౌడ్ మాట్లాడుతూ చిలప్‌చెడ్ ను మండలంగా చేసినప్పటికీ ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, సీనియర్ నాయకుడు రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పండరి, సందీప్, ధన్‌సింగ్, నరసింహచారి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూంలు ఇవ్వాలి



మాట్లాడుతున్న బస్వరాజు

మెదక్ కలెక్టరేట్: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూములు కేటాయించాలని ప్రజా సంఘాల జిల్లా కన్వీనర్ బసవరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ ఆదివారం నుంచి 27వ తేదీ వరకు జిల్లాలో బస్సుజాత నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకొని పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. సమావేశంలో నాయకులు మల్లేశం, దేవయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే విఫలం



పార్టీ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

నర్సాపూర్: నర్సాపూర్ నియోజకవర్గంలోని ప్రజలు, రైతుల సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి విఫలమయ్యారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమల ఆంజనేయులు ఆరోపించారు. శనివారం నర్సాపూర్‌లో జరిగిన ఆ పార్టీ నియోజకవర్గ సీనియర్ కార్యకర్తల సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దళారి, ఇసుక, వడ్ల, భూముల కుంభకోణాలకు పాల్పడే వారికి ఎమ్మెల్యే అండగా ఉంటున్నారని ఆరోపించారు. అవినీతికి పాల్పడుతున్న ఎమ్మెల్యేకు రాబోయే ఎన్నికలలో ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు. ప్రధాని మోదీ రాష్ట్రానికి నిధులు కేటాయిస్తున్నా బీఆర్ఎస్ మంత్రులు విమర్శించడం తగదన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్, సింగాయిపల్లి గోపి, గడ్డం శ్రీనివాస్, రఘువీరారెడ్డి, సురేష్, మల్లేష్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

ఊరూరా మంచినీళ్లే..

'మిషన్ భగీరథ'తో తీరిన ప్రజల తాగునీటి గోస

- నాడు నీటి కోసం బిందెలతో యుద్ధం
- నేడు ఇంటింటికీ ఫిల్టర్ నల్లానీరు
- జిల్లాలో 1.92 లక్షల నల్లా కనెక్షన్లు



రేగోడు మండలం పోచారం వద్ద ఏర్పాటు చేసిన నీటి శుద్ధియంత్రం

మెదక్‌జోన్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా మంచినీళ్ల పండగ జరుపుకునేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఒకప్పుడు బిందెడు నీళ్ల కోసం కుళాయిలు, చేతిపంపుల వద్ద ఒక యుద్ధమే జరిగేది. నేడు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ శుద్ధ జలాలు సరఫరా అవుతుండటంతో ప్రజలకు తాగునీటి తిప్పలు తప్పాయి.

- రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైనది మిషన్ భగీరథ. ఏ ఒక్క ఆడబిడ్డ బిందెలు పట్టుకుని నీటి కోసం రోడ్లవెంట తిరుగొద్దన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశ పెట్టారు.
- మెదక్ జిల్లాలో తాగునీటి పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.880 కోట్లు ఖర్చు చేసింది. మొత్తం 20 మండలాలు ఉన్నాయి. వాటిలో గజ్వేల్ నియోజక వర్గంలోని తూప్రాన్, మనోహరాబాద్‌తో పాటు దుబ్బాక నియోజకవర్గంలోని చేగుంట, నార్సింగ్ మండలాలకు సిద్దిపేట జిల్లా కోమటిబండ మీదుగా గోదావరి నీరు సరఫరా అవుతుంది.
- మిగతా 16 మండలాలకు గాను నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని 6 మండలాల్లోని 1,92,857 ఇళ్లకు 25నుంచి 30 ఎంఎల్‌డీ సింగూర్ నీటిని మంజీరా బ్యారేజ్ ద్వారా సరఫరా చేస్తున్నారు. అదేవిధంగా మెదక్ నియోజకవర్గంలోని 6 మండలాలతో పాటు అందోల్ నియోజకవర్గంలోని 3 మండలాలకు, అలాగే నారాయణఖేడ్ మండలం పెద్దశంకరంపేటకు సైతం సింగూర్ ప్రాజెక్టు నుంచి నిత్యం 90 ఎంఎల్‌డీ నీరు సరఫరా అవుతుంది.
- జిల్లా వ్యాప్తంగా 1,525 ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించారు. అలాగే 2,428.62 కిలోమీటర్ల మేర పైపులైన్లను వేశారు. అదేవిధంగా 873 ప్రభుత్వ బడులు, 974 అంగన్‌వాడీ భవనాలు, 74 రైతు వేదికలు, 469 వైకుంఠధామాలకు భగీరథ నీటి కులాయిల కనెక్షన్లు ఇచ్చారు. ఇందుకోసం మొత్తం రూ.880 కోట్లు ఖర్చు చేశారు.

మూడు నీటిశుద్ధి యంత్రాలు

- సింగూర్ ప్రాజెక్టు నుంచి 16 మండలాలకు సరఫరా అవుతున్న తాగునీటి కోసం 28 ఓహెచ్‌ఆర్(అతిపెద్ద) ట్యాంకులు, 8 పంపింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా 3 నీటిశుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో రేగోడు మండలం పోచారం పరిధిలో, సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల పరిధిలోని పెద్దరెడ్డి పేట గ్రామంలో, సంగారెడ్డి జిల్లాలో హత్నూర మండలం బోరపట్లలో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేశారు.
- కాగా, సింగూరు ప్రాజెక్టులో నీరు నిలువ ఉండటంతో ఒక్కోసారి సన్నటి నాచు వస్తున్నట్లు ప్రజలు చెబుతున్నారు. నీటిని శుద్ధి యంత్రం ద్వారా పరిశుభ్రం చేస్తున్నామని, అనుమానం లేకుండా తాగవచ్చని అధికారులు చెబుతున్నారు

భగీరథ నీటిని తాగొచ్చు



మిషన్ భగీరథ నీటిని నిర్భయంగా తాగొచ్చు. సింగూర్ నుంచి సరఫరా చేసే నీటిని ఫిల్టర్ చేశాకనే నల్లాల ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తున్నాం. అదేనీటిని మేము కూడా తాగుతున్నాం.

– కమలాకర్ మిషన్, భగీరథ, ఈఈ

వేడుకలు విజయవంతం చేయాలి

కలెక్టర్ రాజర్షి షా

మెదక్ కలెక్టరేట్: నేడు నిర్వహించనున్న మంచినీళ్ళ పండుగను విజయవంతం చేయాలని కలెక్టర్ రాజర్షి షా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం ప్రతి గ్రామ పంచాయతీలోని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల వద్ద ఘనంగా జరపాలన్నారు. ట్యాంకుల వద్ద ముగ్గులు వేసి, ఉదయం 8 గంటలకు డప్పు చప్పుళ్లతో బోనాల ర్యాలీ తీయాలన్నారు. గతంలో నీళ్ల కోసం మహిళలు పడిన ఇబ్బందులు, నేడు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లాలతో తాగునీటిని అందిస్తున్న తీరును తెలియజేసేలా గ్రామసభల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా నీటి పొదుపుపై అవగాహన కల్పించాలన్నారు. నీటి సంరక్షణలో ఉత్తమ ప్రతిభ కనపరచిన వారిని సన్మానించాలని చెప్పారు. అన్ని ప్రాంతాల్లో ఉదయం 11.30 గంటల వరకు కార్యక్రమాలను ముగించుకొని హత్నూర మండలం బోర్పట్లలోని నీటి శుద్ధి కేంద్రం వద్దకు చేరుకోవాలన్నారు. అక్కడ నీటిని శుద్ధి చేసే తీరును ఇంజనీరింగ్ అధికారులు వివరిస్తారని కలెక్టర్ తెలిపారు.



అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ సువర్ణలత

పాలిటెక్నిక్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన

మెదక్ కలెక్టరేట్: మెదక్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం పాలీసెట్‌కు సంబంధించిన సర్టిఫికెట్లను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సువర్ణలత ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమానికి 215మంది అభ్యర్థులు హాజరయ్యారు. లెక్చరర్లు వినోద్‌కుమార్, స్వరాజ్, భవానికుమార్, శ్రీనివాస్‌రావు, మోహన్‌కుమార్, శ్రీనాథ్ తదితరులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు.

ఈ నెల 22న అమరుల సంస్మరణ తీర్మానం

హాజరు కానున్న జెడ్పీ చైర్‌పర్సన్

మెదక్ కలెక్టరేట్: ఈ నెల 22న అమరుల సంస్మరణ తీర్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో వెంకట శైలేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ అమరులకు శ్రద్ధాంజలి ఘటించడంతోపాటు సంస్మరణ తీర్మానం ఉంటుందని చెప్పారు. సమావేశానికి జెడ్పీ సభ్యులు, అధికారులు హాజరు కావాలన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



న్యాయమూర్తులకు స్వాగతం పలుకుతున్న ఆలయ సిబ్బంది, అర్చకులు



చర్చి గురించి వివరిస్తున్న మతగురువు రిచర్డ్

పాపన్నపేట(మెదక్): ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన ఏడుపాయల వనదుర్గ అమ్మవారిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ శనివారం దర్శించుకున్నారు. జడ్జికి ఈవో సార శ్రీనివాస్, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన జడ్జికి అర్చకులు తీర్థప్రసాదాలు అందించి జ్ఞాపికను అందించారు. ఆయన వెంట న్యామూర్తులు నవీన్‌రావ్, సంతోష్‌రెడ్డి, రాష్ట్ర అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిణి, న్యాయమూర్తులు, న్యాయవాదులు ఉన్నారు.

మెదక్ చర్చి సందర్శన...

మెదక్‌జోన్: ప్రఖ్యాత మెదక్ సీఎస్ఐ చర్చిని రాష్ట్ర హైకోర్టు చీఫ్‌జస్టిస్ ఉజ్జల్‌భుయాన్ శనివారం సందర్శించారు. కలెక్టర్ రాజర్షిషాలతో కలిసి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతగురువు రిచర్డ్ చర్చికి సంబంధించిన విశిష్టతను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు జడ్జిలు పి.నవీన్‌రావు, సంతోష్‌రెడ్డి, మెదక్ జిల్లా జడ్జి లక్ష్మీశారద పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 208 మంది గైర్హాజరు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో జరుగుతున్న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు శనివారం 208 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్ పరీక్షల నోడల్ అధికారి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 2,797మంది హాజరు కావాల్సి ఉండగా, 2,636 మంది హాజరైనట్లు చెప్పారు. 161మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఇంటర్ సెకండియర్ పరీక్షలకు 1,028 మంది హాజరు కావాల్సి ఉండగా, 981మంది హాజరయ్యారు. 47మంది గైర్హాజరైనట్లు చెప్పారు.

పంచాయతీలుగా ఆవిర్భవించాకే తండాల అభివృద్ధి

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



లాక్యా తండాలో బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): గిరిజన తండాలను పంచాయతీలుగా మార్చి అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గిరిజన దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని కాట్రియాల, దంతేపల్లి, కిషన్ తండా, కాట్రియాల తండా, లాక్యా తండాల్లో పంచాయతీ భవనం, కమ్యూనిటీ హాళ్లు, తరగతి గదుల నిర్మాణాలకు ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. 70 ఏళ్లలో జరగని అభివృద్ధి బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో చేసి చూపిందన్నారు. నేడు అన్ని గిరిజన తండాల్లో కరెంటు సదుపాయం కల్పించడంతోపాటు వారి శ్రేయస్సు కోసం సీఎం కేసీఆర్ 10 శాతం రిజర్వేషన్ ప్రకటిస్తే, కేంద్రం సహకరించడం లేదన్నారు. గిరిజన బాలికల కోసం ప్రత్యేకంగా రెసిడెన్షియల్ కళాశాలలు, పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.3లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు గిరిజన తండాల్లో ఎమ్మెల్యేకు మహిళలు బోనాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె వారితో కలిసి బోనం ఎత్తుకొని నృత్యం చేశారు. కార్యక్రమాల్లో రామాయంపేట మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, సర్పంచులు శ్యాములు, సుభాష్, సురేశ్ నాయక్, నర్సాగౌడ్, ఉప సర్పంచ్ కొత్త స్రవంతి, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, ఎస్టీ కార్పొరేషన్ ఈడీ విజయలక్ష్మి, చిన్నశంకరంపేట జడ్పీటీసీ రాజు, కౌన్సిలర్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి, తహసీల్దార్ మన్నాన్ పాల్గొన్నారు.

ఆరుగురికి ఒక్కరే!

- అమ్నాపూర్ తండా పాఠశాలలో దుస్థితి
- తూప్రాన్ మండలంలో తూతూమంత్రంగా 'బడిబాట'
- ప్రభుత్వ బడుల్లో తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత



న్యూ అమ్నాపూర్ తండా ప్రభుత్వ పాఠశాల

ప్రభుత్వ పాఠశాలల దుస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది. కొన్ని బడుల్లో విద్యార్థులున్నచోట ఉపాధ్యాయులు ఉండటం లేదు. మరి కొన్నిట్లో ఉపాధ్యాయులుంటే పిల్లలు రావడం లేదు. దీంతో సర్కార్ బడుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. సర్కార్ బడులను ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. మన ఊరు - మన బడి, బడిబాట కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగానే కనిపిస్తోంది.

తూప్రాన్: తూప్రాన్ మండలం బడిబాట కార్యక్రమం తూతూమంత్రంగా నిర్వహించినట్లు విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడంలో ఉపాధ్యాయులు అలసత్వం చూపుతున్నారని తెలుస్తోంది. మండలంలోని మల్కాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని న్యూ అమ్నాపూర్ తండాలోని పాఠశాలలో ఆరుగురు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉండటం ఇందుకు నిదర్శనం.

- న్యూ అమ్నాపూర్ తండాలో 15 కుటుంబాలు నివసిస్తున్నాయి. తండాలో మొత్తం ఎనిమిది మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో ఇద్దరు ప్రైవేట్ పాఠశాలకు వెళుతున్నారు. మిగతా ఆరుగురు విద్యార్థులు తండాలోని పాఠశాలలో రెండో తరగతిలో ఒకరు, మూడో తరగతిలో ఐదుగురు చదువుతున్నారు. వీరికి ప్రభుత్వం ఒక ఉపాధ్యాయుడిని నియమించింది. అతను అత్యవసర పనులపై సెలవు పెట్టి వెళ్తే పాఠశాల ఆ రోజు మూత పడాల్సిందే. కేవలం ఆరుగురు విద్యార్థులకు వేల రూపాయలు వెచ్చించి ప్రభుత్వ ఉపాధ్యాయుడిని నియమించడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.
- అమ్నాపూర్ తండా సమీపంలో రెండు కిలోమీటర్ల దూరంలో మల్కాపూర్, నర్సంపల్లి ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఈ బడులకు రవాణా సదుపాయం కల్పించి అమ్నాపూర్ తండా పాఠశాల విద్యార్థులను పంపిస్తే నాణ్యమైన విద్య అందే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. 2018లో న్యూ అమ్నాపూర్ తండా పాఠశాలలో సరిపడా విద్యార్థుల సంఖ్య లేక మూత పడింది. కొందరు రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో తిరిగి ఈ విద్యా సంవత్సరం పాఠశాలను ప్రారంభించినట్లు తెలిసింది.

వట్టూరులో అదే పరిస్థితి

మండలంలోని వట్టూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పది మంది విద్యార్థులున్నారు. ఇక్కడ రెగ్యులర్ ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యాశాఖ డిప్యూటేషన్‌పై పడాల్‌పల్లి ప్రభుత్వ పాఠశాల నుంచి ఒకరిని నియమించింది. అయితే కొందరు ప్రైవేట్ పాఠశాలల్లో చేరడంతో విద్యార్థుల సంఖ్య ఆరుకు చేరింది. దీంతో మండల విద్యాధికారి ఆ పాఠశాల విద్యార్థులను సమీపంలోని పడాల్‌పల్లి పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా మండలంలోని కొన్ని పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యా బోధన కుంటుపడుతోందని తెలుస్తోంది.



తండా పాఠశాలలో ఉపాధ్యాయుడితో ఆరుగురు విద్యార్థులు

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు, నాణ్యమైన విద్యనందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బడిలో విద్యార్థుల సంఖ్య తక్కువ ఉంటే తల్లిదండ్రులతో చర్చించి వారిని సమీప బడుల్లో చేర్పించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఉపాధ్యాయులున్నచోట ఒక విద్యార్థి హాజరైనా పాఠశాలను కొనసాగించాలన్న ప్రభుత్వ నిబంధనను పాటిస్తున్నాం.

– బుచ్యానాయక్, ఎంఈఓ, తూప్రాన్

సైక్లింగ్‌తో ఆరోగ్యం

నర్సాపూర్ రూరల్: సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌కు చెందిన సైక్లింగ్ గ్రూప్ ఆర్గనైజర్లు సుభాష్ రెడ్డి, రవీందర్ అన్నారు. శనివారం నర్సాపూర్ మండలం చిప్పల్ తుర్తి, జక్కపల్లి మీదుగా ఇబ్రహీంబాద్‌కు సైక్లింగ్ బృందం చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులు శరీర దారుఢ్యం, ఆరోగ్యం కోసం బైకులను పక్కన పెట్టి సైక్లింగ్ చేయాలని సూచించారు. తమ బృందం ప్రతీ శని, ఆదివారాలు సైక్లింగ్ పట్ల అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

టేక్మాల్(మెదక్): గిరిజనుల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అందోల్ ఎమ్మెల్యే కాంత్రి కిరణ్ పేర్కొన్నారు. శనివారం రాత్రి మండలంలోని చంద్రుతండాలో గిరిజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తండా పంచాయతీ నూతన భవన నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తండాల రూపురేఖలను మార్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతా స్వప్నరవి, సర్పంచ్ స్రవంతిసర్దార్, మండల ప్రత్యేకాధికారి జమ్లానాయక్, ఎంపీడీవో భారతి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరప్ప, భాస్కర్, యశ్వంత్‌రెడ్డి, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గడ్డివాములు, ఎద్దులబండి దగ్ధం



కాలిపోతున్న గడ్డివాములు

నారాయణఖేడ్: కొండాపూర్ పంచాయతీ పరిధిలోని శివార్‌సంద్ తండాలో శనివారం తెల్లవారుజాము జరిగిన అగ్నిప్రమాదంలో గడ్డివాములు, ఎద్దులబండి దగ్ధమయ్యాయి. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం వడిత్యాకిషన్ నాయక్ 280 గడ్డివాములను కొని ఇంటి సమీపంలోని ఖాళీస్థలంలో నిల్వ ఉంచాడు. తెల్లవారుజాము మంటలు ఎగిసిపడుతుండటాన్ని తండావాసులు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారొచ్చే సరికి గడ్డివాములు, ఎద్దులబండి దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదం కారణంగా రూ.లక్ష నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని లంబాడాహక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రకాష్‌రాథోడ్ విజ్ఞప్తి చేశారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మృతి

మెదక్ రూరల్: చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందిన సంఘటన హవేళీఘణాపూర్ మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఏసు(27) గ్రామశివారులోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయినట్లు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య రాధిక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొలంలో మహిళ మృతదేహం

జహీరాబాద్ టౌన్: గుర్తుతెలియని మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని బూచినెల్లి గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో చోటుచేసుకుంది. చిరాగ్‌పల్లి ఎస్‌ఐ కాశీనాథ్ కథనం ప్రకారం శనివారం వ్యవసాయ పొలంలో ట్రాక్టర్ దున్నుతున్న సమయంలో డ్రైవర్, మహిళ (50) మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చాడు. కేసు దర్యాప్తులో ఉంది.

నాన్నే మా హీరో

- బిడ్డలను గ్రాడ్యుయేట్స్ చేసిన టైలర్ అబ్దుల్లా
- ఏకైక కుమారుడిని సైన్యంలోకి పంపిన అడ్వొకేట్ వెంకట్‌రెడ్డి
- సిద్దిపేట అదనపు కలెక్టర్‌గా ఏకేఖాన్ కుమారుడు ముజామ్మిల్ ఖాన్
- ఐపీఎస్ స్ఫూర్తితో ఐఏఎస్‌లోకి..

ఆయన ఓ సాధారణ టైలర్. టైలరింగ్ చేస్తూ తన ముగ్గురు కుమార్తెలను, కుమారుడిని గ్రాడ్యుయేట్స్‌ను చేశాడు. అందులో ఇద్దరు కుమార్తెలు జీవితంలో సెటిల్ కాగా, మరో కూతురు, కుమారుడు ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో ఉన్నారు. తాను ఇంటర్ చదివినా, తన సంతానాన్ని పట్టభద్రులను చేశాడు. ఆయనే అందోల్‌కు చెందిన షేక్ అబ్దుల్లా. అలాగే తన ఏకైక కుమారుడు సిద్ధార్థ్ రెడ్డిని ఆర్మీకి పంపారు. చిన్నతనం నుంచే కొడుకు అభిష్టాన్ని ప్రోత్సహించారు. అప్పుడు లెఫ్టినెంట్ హోదాలో సైన్యంలో చేరిన సిద్ధార్థ్ రెడ్డి ప్రస్తుతం మేజర్‌గా ఉన్నారు. ఆయనే సిద్ధార్థ్ తండ్రి వెంకట్‌రెడ్డి. నాన్న ప్రోద్బలంతోనే ఈ స్థాయికి చేరామని సిద్దిపేట అదనపు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, మేజర్ సిద్ధార్థ్ రెడ్డి చెబుతున్నారు. ఫాదర్స్ డే సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనాలు..

అహర్నిశలు శ్రమించిన అబ్దుల్లా

జోగిపేట(అందోల్): దర్జీ (టైలరింగ్) పనిచేస్తూనే సమాజంలో తలెత్తుకొని తిరిగేలా తన బిడ్డలను ఉన్నత చదువులు కోసం అహర్నిశలు కష్టపడిన వ్యక్తి షేక్ అబ్దుల్లా. ఫాదర్స్ డే సందర్భంగా షేక్ అబ్దుల్లాపై ప్రత్యేక కథనం. అందోల్ మండలం పోసానిపేట గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్లా జోగిపేట పట్టణంలోని ఆర్ఎస్ టేలర్ దర్జీ. రోజూ స్వగ్రామం నుంచి 2 కిమీ కాలినడకనే టైలర్ షాప్‌కు చేరుకుంటారు. ఆయనకు ముగ్గురు కూతుళ్లు అసియా సుల్తానా, అస్మీ, ఆస్మా, షేక్ అహ్మద్ అనే కుమారుడు ఉన్నారు. నలుగురిని పోస్ట్ గ్రాడ్యుయేట్ వరకు చదివించారు. ఇందులో అస్మీ ఝరాసంఘం పాఠశాలలో, ఆస్మా రాయికోడ్ మండలం పిప్పడ్ పల్లి గ్రామంలోని పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నది. అసియా సుల్తానా, షేక్ అహ్మద్‌లూ టీచర్ పరీక్షలకు రాశారు. షేక్ అహ్మద్ ప్రస్తుతం గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నారు. టైలరింగ్‌పైనే కుటుంబం



జోగిపేటలో టైలరింగ్ పని చేస్తున్న షేక్ అబ్దుల్లా

ఆధారపడి ఉన్నా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతున్నాడు. తన పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్న ఆలోచన ఎందుకు వచ్చిందని 'సాక్షి' ప్రశ్నించగా ।నేనే కేవలం ఇంటర్ వరకే చదువుకున్నా. నా పిల్లలను ఉన్నత చదువులు చదివించి సొసైటీలో శభాష్ అని పించుకోవాలన్నదే నా ఆశ. పిల్లలంతా ఉన్నత చదువులు చదివినందుకు గ్రామంలోనూ నాపై గ్రామస్తులకు ప్రత్యేక అభిమానం ఉంది అని' తెలిపారు.

చిన్ననాటి నుంచి ప్రోత్సాహం

జహీరాబాద్: ఒక్కగానొక్క కుమారుడు సిద్ధార్థ్ రెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి ప్రోత్సాహంతో ఆర్మీలో మేజర్ స్థాయికి ఎదిగారు. అడ్వొకేట్ వెంకట్‌రెడ్డి కోహీర్ మండలం పోతిరెడ్డిపల్లి గ్రామస్తుడు. కాగా ఆయన జహీరాబాద్‌లో స్థిరపడ్డారు. కుమారుడు సిద్ధార్థ్ రెడ్డిని చిన్నప్పటి నుంచి అన్ని రంగాల్లోనూ ప్రోత్సహించారు. ప్రాథమిక విద్య జహీరాబాద్‌లో పూర్తి చేసుకున్నాడు. ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. దేశానికి సేవలందించాలనే ఉద్దేశంతో ఆర్మీలోకి చేరేందుకు ప్రోత్సహించాడు. 2011లో సర్వీసు సెలెక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) సెలక్షన్ తర్వాత లెఫ్టినెంట్ అయ్యాడు. 2012లో డెహ్రాడూన్‌లో ఆర్మీ శిక్షణకు వెళ్లాడు. 2013లో కమిషన్ ఆఫీసర్‌గా, 2014లో కెప్టెన్‌గా నియమితులయ్యాడు. 2018లో మేజర్‌గా పదోన్నతి. మరో మూడేళ్ల అనంతరం లెఫ్టినెంట్ కల్నల్‌గా పదోన్నతి పొందనున్నారు. ఈ సందర్భంగా సిద్ధార్థ్‌రెడ్డి మాట్లాడుతూ, తల్లిదండ్రుల ప్రోత్సాహం



మేజర్ సిద్ధార్థ్‌రెడ్డితో తల్లిదండ్రులు వసంత, వెంకట్‌రెడ్డి

తోనే తాను ఈ స్థాయికి ఎదిగానన్నారు. దేశానికి సేవలందించడం సంతోషంగా ఉందన్నారు. భోపాల్, జమ్మూకశ్మీర్, అమృత్‌సర్ రాష్ట్రాల్లోని దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం మేఘాలయలోని షిల్లాంగ్‌లో చైనా బోర్డర్‌లో విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు వసంత–వెంకట్‌రెడ్డి ప్రోత్సహించడంతోనే ఈ ఘనత సాధించినట్లు పేర్కొన్నారు.

ఆయనలాగే ఉండాలని..

మా నాన్న స్ఫూర్తితోనే, నేను ఈ స్థాయికి చేరాను. మా నాన్నకు ఉద్యోగ విధుల నిమిత్తం 24/7 ఎంత బిజీగా ఉన్నప్పటికీ ఫ్యామిలీ పై ప్రత్యేక దృష్టి పెట్టారు. పని ఒత్తిడిలో, కష్టకాలంలో ఉన్న సైతం అంత ఎఫెక్ట్ చూపించేవారు కాదు. రోజూ సాయంత్రం నాతో, అన్నయ్య, చెల్లితో చదువుల గుర్చి, మార్నింగ్ నుంచి ఈవినింగ్ వరకు ఏం చేశారని విషయాలు తెలుసుకునే వారు. ఆయన లాగే ఉండాలని ఉంది... ఆయన చేసిన దానిలో కొంతైన చేయాలని కోరిక ఉంది. నాకు ఏజ్ పెరుగుతున్న కొద్ది వెనక్కి చూస్తే ఇప్పుడు తెలుస్తోంది నాన్న మా కోసం ఎలా కష్ట పడ్డారు అని. నా సక్సెస్ వెనుక అమ్మానాన్న ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుంది.

ముజామ్మిల్ ఖాన్, సిద్దిపేట అదనపు కలెక్టర్ (రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, ప్రభుత్వ సలహాదారుడు ఏకే ఖాన్ కుమారుడు)



యువకుడి అనుమానాస్పద మృతి

జిన్నారం (పటాన్‌చెరు): శరీరంపై గాయాలతో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటన ఖాజీపల్లిలో శనివారం జరిగింది. సీఐ సురేందర్‌రెడ్డి, మృతుడి సోదరుడు ముత్తంగిల బాలు తెలిపిన వివరాల ప్రకారం.. జిన్నారం మండలం ఖాజీపల్లిలో ముత్తంగిల గోపి(25), తన భార్య వసుంధర, కూతురు దీక్షతో కలిసి ఉండేవాడు. 10 రోజుల క్రితం భార్యాభర్తలు గొడవపడగా కూతురితో సహా వసుంధర పుట్టింటికి చేరింది. దీంతో గోపి బొల్లారం వైఎస్సార్ కాలనీలో నివసిస్తున్న సోదరుడు బాలు ఇంట్లో తిని, పనికి వెళ్తుండేవాడు. రాత్రుళ్లు ఖాజీపల్లిలోని తన ప్లాట్‌కు వెళ్లేవాడు. రోజులాగే ఈనెల 16న తిని వెళ్లాడు. శనివారం అతడు సోదరుడి ఇంటికి తిరిగిరాలేదు. బాలు పలుమార్లు ఫోన్ చేసి, గోపి ప్లాట్‌కు వెళ్లి చూడగా అతడు విగతజీవిగా కనిపించాడు. అక్కడ వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బాలు ఫిర్యాదు మేరకు సీఐ సురేందర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



లింగం (ఫైల్)

రాయపోలు(దుబ్బాక): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దౌల్తాబాద్ మండలం సూరంపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై చైతన్యకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొల్లం లింగం (32) గతంలో రూ.2లక్షల డౌన్‌పేమెంట్ కట్టి ట్రాక్టర్ తీసుకున్నాడు.మిగతా వాయిదాలలో చెల్లించేందుకు ఒప్పుకున్నాడు. ఈఎంఐలు సరిగా కట్టకపోవడంతో ఫైనాన్స్ వారు ట్రాక్టర్ తీసుకెళ్లారు. ఆ తర్వాత పాల వ్యాపారం చేసి రూ.లక్ష, తనకున్న 20 గుంటలలో 3 బోర్లు వేసి రూ.2లక్షల వరకు నష్టపోయాడు. మొత్తంగా రూ.5లక్షలు అప్పులయ్యాయి. అప్పుల వారి వేధింపులకు తాళలేక ఈ నెల 12న పురుగుల మందు తాగాడు. స్నేహితుడు, కుటుంబ సభ్యులు గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి బాధితుడిని తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

698 మంది అభ్యర్థుల రాక



సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఎస్ఐ, కానిస్టేబుల్ స్థాయి ఉద్యోగాలకు తుది రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు సంబంధించిన ధ్రువప్రతాల పరిశీలనలో నాల్గోరోజు 800 మంది అభ్యర్థులకు గాను 698 హాజరైనట్లు ఎస్పీ ఎం.రమణ కుమార్ తెలిపారు. అభ్యర్థులు తమ వెంట వెరిఫికేషన్ లెటర్, సంబంధిత ధ్రువపత్రాలన్నీ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు ఒక జిరాక్స్ కాపీ తీసుకొని, కేటాయించిన రోజున సమయానికి పోలీస్ కల్యాణ మండపంలో హాజరు కావలసి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాలనా విభాగాధికారి కళ్యాణి, డీపీవో సిబ్బంది, ఆర్‌టీవో. ఐటీ సెల్ సిబ్బంది ఉన్నారు.

మతిస్థిమితం లేని వివాహితపై లైంగిక దాడి

- ఆరునెలల గర్భం దాల్చిన వైనం
- పోలీసుల అదుపులో నిందితుడు
- పేరూరులో వెలుగుచూసిన ఘటన

మెదక్ రూరల్: మానసిక పరిస్థితి సరిగ్గా లేని వివాహితపై లైంగికదాడికి పాల్పడి గర్భవతిని చేశాడు ఓ దుర్బుద్ధుడు. ఈ ఉదంతం పేరూరులో శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ యువతి (26)కి మానసిక పరిస్థితి సరిగ్గా లేదు. కొంతకాలం క్రితం ఓ వ్యక్తితో వివాహం జరిపించగా భర్తతో విడిపోయి తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. అదే గ్రామా నికి చెందిన ఏసు అనే వ్యక్తి వివాహితకు మాయ మాటలు చెప్పి కొంతకాలంగా లైంగికదాడికి పాల్పతున్నాడు. ఈ క్రమంలో ఆమె ఆరు నెలల గర్భం దాల్చింది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

గేదెల కోసం వెళ్లి గల్లంతు

టేక్మాల్ (మెదక్): గేదెల కోసం వెళ్లిన నదిలో వ్యక్తి గల్లంతైనా సంఘటన టేక్మాల్ మండలంలోని ఎలకుర్తిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కందిపల్లి నారాయణ(56) వ్యవసాయంపై జీవిస్తున్నాడు. రెండు రోజులు అతడి గేదెలు కనిపించకుండా పోగా శనివారం ఉదయం మంజీరనదిలో సేదదీరుతున్న విషయాన్ని గమనించాడు.



నారాయణ (ఫైల్‌ఫొటో)

వాటిని బయటికి తోలేందుకు నదిలోకి దిగి ప్రవాహానికి ప్రమాదవశాత్తు మునిగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు సింగూరు నుంచి గజ ఈతగాళ్లను పిలిపించి నదిలో వెతికించినా అతడి ఆచూకీ లభించలేదు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కంటైనర్

ఒడిశా యువతికి తీవ్రగాయాలు

తూప్రాన్: ఆర్టీసీ బస్సును కంటైనర్ లారీ ఢీకొన్న సంఘటనలో ప్రయాణికురాలికి తీవ్రగాయాలైన సంఘటన పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై కరీంగూడ చౌరస్తా వద్ద శనివారం చోటు చేసుకుంది. ఒడిశా రాష్ట్రానికి చెందిన సబితా మల్లిక(23) అనే యువతి కామారెడ్డిలోని ఓ హోటల్‌లో పని చేస్తోంది. హైదరాబాద్ నుంచి కామారెడ్డికి ఆర్మూర్ ఆర్టీసీ డిపో బస్సులో బయలుదేరింది. కరీంగూడ చౌరస్తా వద్దకు బస్సు చేరుకోగానే అతివేగంగా వచ్చిన కంటైనర్ లారీ ఢీకొంది. ఈ



చికిత్స పొందుతున్న సబితా మల్లిక

ప్రమాదంలో సబితా కు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

జోగిపేట(అందోల్): క్రీడల్లో క్రీడాస్ఫూర్తి ముఖ్యమని జోగిపేట మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య అన్నారు. జోగిపేటలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన జోగిపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. యువకుల్లో క్రీడానైపుణ్యతను వెలికితీసేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయన్నారు. ఈ పోటీల్లో జోగిపేటకు చెందిన కేకే -ఏ టీం విన్నర్‌గా గెలుపొందగా వారికి రూ.10వేల నగదు, కేకే -బీ టీం రన్నర్‌గా గుర్తించి రూ.5వేల నగదును నిర్వాహకులు అందజేశారు. క్రీడాకారులకు కప్‌లను చైర్మన్ మల్లయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నాగరాజు, చందు, బీఆర్ఎస్ నాయకులు సీహెచ్.వెంకటేశం, ఖాజాపాషా, బాబాలు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ మల్లయ్య

ఇసుక లోడ్‌కెళ్లొచ్చే లోపు..

భార్య సహా రూ.2 లక్షల నగదు అదృశ్యం



రష్మి (ఫైల్‌ఫొటో)

పటాన్‌చెరు టౌన్: భార్య కనిపించడం లేదని భర్త ఫిర్యాదు చేసిన సంఘటన శనివారం భానూర్–బీడీఎల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం మెదక్‌కు చెందిన రాజేశ్వర్ పటాన్‌చెరు మండలం పాశమైలారం ఉంటూ వ్యాపారం చేసుకుంటున్నాడు. గత నెల 23న ఒడిశా రాష్ట్రానికి చెందిన రష్మితో వివాహమైంది. శనివారం రాజేశ్వర్ ఇసుక లోడ్ ఖాళీ చేయించడానికి వెళ్లి తిరిగి ఉదయం 9.30 గంటలకు తన ఇంటికి రాగా, భార్య రష్మి అదృశ్యమైంది. ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతోపాటు ఇంట్లోని రూ.2 లక్షల నగదు కనిపించడం లేదని రాజేశ్వర్ పేర్కొన్నాడు. ఆమె ఆచూకీ కోసం తెలిసిన, బంధువులను విచారించినా ఫలితం లేకపోయింది. దీంతో రాజేశ్వర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కళ్లల్లో కారంచల్లి చైన్‌స్నాచింగ్

సంగారెడ్డి టౌన్: కళ్లల్లో కారంకొట్టి మహిళా మెడలోంచి బంగారు పుస్తెలతాడు చోరీ చేసి ఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం పోతిరెడ్డిపల్లిలోని శిల్పా వెంచర్లో కిరాణా షాపు నిర్వహిస్తున్న సరిత(35) వద్దకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి కూల్ డ్రింక్ కావాలని అడిగాడు. సరిత తన పాపకు డ్రెస్ వేసి ఇస్తానని చెప్పి ఇంట్లోకి వెళ్లింది. ఇదే అదనుగా భావించిన వ్యక్తి, ఆమెను అనుసరించి ఇంట్లోకి వెళ్లి కళ్లల్లో కారంపొడి చల్లి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును తెంపుకెళ్లాడు. అతడిని చూస్తే గుర్తుపడతానని సరిత చెబుతున్నది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పొలం తడిపేందుకెళ్లి.. విద్యుదాఘాతంతో రైతు మృతి



బాలమల్లయ్య (ఫైల్)

కోహెడ రూరల్(హుస్నాబాద్): విద్యుత్‌షాక్‌తో రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని ఆరేపల్లిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు పకీడే బాలమల్లయ్య(58) శనివారం ఉదయం నారుమడికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు స్టాటర్ వద్ద విద్యుత్‌షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్య కనుకవ్వ ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుల అరెస్టు



నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

జహీరాబాద్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఇద్దరిపై ఇనుపరాడ్డుతో దాడిచేసిన కేసులోని నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అల్లీపూర్ దర్గా సమీపంలో గల డెంటింగ్ షాపు యజమాని అజిమొద్దీన్ తన అక్క కుమారుడైన అహ్మద్‌ను, తాహెర్‌ను షాపులోకి పిలిపించి కొట్టించిన కేసులో నిందితులైన అజిమొద్దీన్, ఇమ్రాన్, అజీంలను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. వీరిని కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.

కారు ఢీకొని కార్మికుడి దుర్మరణం

పటాన్‌చెరు పీఎస్ పరిధిలో ఘటన

పటాన్‌చెరు టౌన్: ఓఆర్‌ఆర్‌పై లైన్ మార్కింగ్ చేస్తున్న కార్మికుడిని కారు ఢీకొన్న ఘటనలో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన శనివారం పటాన్‌చెరు పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నెలరోజులుగా ఓఆర్‌ఆర్ రోడ్డుపై లైన్ మార్కింగ్ పనులు కొనసాగుతుండగా హజారిలాల్ అనే పేయింటర్ వద్ద రాజస్థాన్‌కు చెందిన సుభాష్ సైని(20) పనికి కుదిరాడు. శనివారం సుల్తాన్‌పూర్ ఓఆర్‌ఆర్ నుంచి ముత్తంగి మధ్య లైన్ మార్కింగ్ పనులను హజారిలాల్, సుభాష్ సైని సహా మరికొంతమంది చేస్తున్నారు. షామీర్‌పేట్ వైపు నుంచి పటాన్‌చెరు వెళుతున్న కారు, ఇంద్రేశం సమీపంలోకి వచ్చేసరికి సైన్ బోర్డు, రేడియం సేఫ్టీ



సుభాష్ మృతదేహం

కోన్‌లను దాటి సుభాష్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓఆర్‌ఆర్ బ్రిడ్జిపై నుంచి పటాన్‌చెరు–దౌల్తాబాద్ వెళ్లే రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నర్సాపూర్ వెళుతుండగా ప్రమాదం

శివ్వంపేట(నర్సాపూర్): బైక్ అదుపు తప్పి కింద పడిన సంఘటనలో ఇద్దరికి గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. రామాయంపేట మండలం నందిగామ గ్రామానికి చెందిన వాసు దంపతులు బైక్‌పై నర్సాపూర్‌కు వెళ్తుండగా తూప్రాన్ – నర్సాపూర్ హైవే శివ్వంపేట గ్రామ శివారు రాజన్నవాగు వద్ద బైక్ అదుపు తప్పి దంపతులు కింద పడ్డారు. ఈ ప్రమాదంలో భార్య తీవ్ర గాయాలయ్యాయి. భర్త స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను తరలిస్తున్న స్థానికులు

రెండో రోజూ బస్సుల సీజ్



ఫిట్‌నెస్ పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

పటాన్‌చెరు టౌన్: విద్యాసంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్ పేరిట బస్సులను రవాణా శాఖాధికారులు తనిఖీలు చేస్తున్నారు. రెండోరోజైన శనివారం పటాన్‌చెరులో విద్యాసంస్థలకు చెందిన ఫిట్‌నెస్‌లేని రెండు బస్సులను ఎంవీఐ రాజామహ్మద్, ఏఎంవీఐ లావణ్య సిబ్బంది సీజ్ చేశారు.ఈ సందర్భంగా రాజా మహ్మద్ మాట్లాడుతూ, ఫిట్‌నెస్ లేని బస్సులను రహదారిపైకి తీసుకొస్తే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తాచెదారాలకు నిప్పు

- ఐదు తాటిచెట్లు బుగ్గిపాలు
- కట్కూర్‌లో గడ్డివాము దగ్ధం

అక్కన్నపేట(హుస్నాబాద్): తాటిచెట్లు, గడ్డివాము కాలిబూడిదైన సంఘటన అంతక్కపేట, కట్కూర్ గ్రామాల్లో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం అంతక్కపేట ఊరచెరువు కట్టపై ఉన్న తాటిచెట్లకు నిప్పంటుకొని ఐదారు కాలిపోయాయి.పక్కనున్న వ్యవసాయ క్షేత్రంలో చెత్తాచెదారాలకు నిప్పు అంటించగా గాలిధాటికి తాటిచెట్లకు మంటలంటుకున్నాయి. అలాగే కట్కూర్ గ్రామానికి చెందిన ఓ రైతుకు చెందిన సుమారుగా 5 ఎకరాల గడ్డివాము బూడిదైంది. ఫైరింజన్ సిబ్బంది సంఘటనా స్థలాలకు చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చింది.



అంతక్కపేటలో మంటలను ఆర్పుతున్న ఫైరింజన్ సిబ్బంది

'ఆటో' పరేషాన్?

థియేటర్ వద్ద పార్కింగ్ చేసి మూడు నెలలు

తూప్రాన్: 3 నెలల క్రితం ఓ ఆటోను గుర్తుతెలియని వ్యక్తులు వెంకటేశ్వర థియేటర్ సమీపంలోని రోడ్డు పక్కన వదిలేశారు. అప్పటి నుంచి అది అక్కడే ఉంది. దీని కోసం ఎవరూ రాకపోవడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



వెంకటేశ్వర థియేటర్ సమీపాన వదిలివెళ్లిన ఆటో ఇదే

క్లుప్తంగా

'నిధులు మంజూరు చేయాలి'



మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న టీచర్లు

రామాయంపేట(మెదక్): మండలంలోని కాట్రియాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూత్రశాలలు లేకపోవడంతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారని పాఠశాల ఉపాధ్యాయులు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు వారు శనివారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను కలిసి పరిస్థితి వివరించారు. అలాగే అసంపూర్తిగా నిలిచిపోయిన సైన్స్ ల్యాబ్ పనులు పూర్తి చేయించాలని ఎమ్మెల్యేకు వారు వినతిపత్రం అందజేశారు.

ఎల్‌ఓసీ అందజేత

మనోహరాబాద్(తూప్రాన్): అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబానికి చికిత్స కోసం రూ. 5 లక్షల ఎల్‌ఓసీని జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత మండల కేంద్రంలో శనివారం అందజేశారు. సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ రేణుకుమార్, నాయకులు నాగిరెడ్డి, దండుపల్లి ఉప సర్పంచ్ మహేందర్‌గౌడ్, సుధాకర్, దేవేందర్ ఉన్నారు.

లింగాయత్‌లకు రూ.లక్ష ఆర్థిక సాయం ఇవ్వాలి

అల్లాదుర్గం(మెదక్): బలహీన వర్గాలకు చెందిన వారికి ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష ఆర్థికసాయం వీరశైవ లింగాయత్ కులస్తులకు అందజేయాలని అల్లాదుర్గం మండల సంఘం అధ్యక్షుడు పాంపాటి వీరన్న డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ... వీరశైవ లింగాయత్‌లు ఆర్థికంగా వెనకబడి ఉన్నా.. ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు.

నేటి నీళ్ల పండగను విజయవంతం చేయాలి

రేగోడ్(మెదక్): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన రేగోడ్‌లో నేడు ఆదివారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్న నీళ్ల పండగను విజయవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విజయభాస్కర్ శనివారం కోరారు. ర్యాలీ అనంతరం సమావేశం ఉంటుందని, ఈ కార్యక్రమానికి ప్రతీ ఒక్కరూ హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

హరితహారం జయప్రదం చేయాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఈ నెల 19న గ్రామ పంచాయతీల్లో నిర్వహించే హరితహారం కార్యక్రమం జయప్రదం చేయాలని ఎంపీడీఓ శశిప్రభ అన్నారు. శనివారం ఆమె మండల పరిధిలోని సోమక్కపేట్ గ్రామ శివారులో మొక్కలు నాటేందుకు తీస్తున్న గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా శశిప్రభ మాట్లాడుతూ.. మొక్కలు నాటేందుకు పూర్తి స్థాయిలో గుంతలు సిద్ధం చేయాలని ఉపాధి కూలీలకు సూచించామన్నారు.

'రోడ్లను చూసి పట్టణ ప్రగతి చేపట్టాలి'

మెదక్‌జోన్: పట్టణంలో ప్రగతి గతి తప్పిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజ్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రగతి పేరుతో బీఆర్‌ఎస్ చేస్తున్న ఆర్భాటాన్ని తప్పుబట్టారు. మెదక్ పట్టణంలో రోడ్ల పరిస్థితి చూసి సిగ్గుపడాలని ఆయన హితవు పలికారు. మెదక్ పట్టణ ప్రజలు నిత్యం రోడ్ల సమస్యపై చెబుతున్నప్పటికీ ఎమ్మెల్యే స్పందించలేదని ఆరోపించారు.

చేయూత

మనోహరాబాద్(తూప్రాన్): పూరి గుడిసె దగ్ధమైన కుటుంబానికి గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు జశ్వంత్‌రెడ్డి రూ. 20 వేల నగదును శనివారం అందజేశారు. మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన జల్లి పోచయ పూరి గుడిసె రెండు రోజుల క్రితం దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న ఆయన వారిని పరామర్శించారు. వీరి వెంట నాయకులు బాలకృష్ణారెడ్డి, నియోజకవర్గ ఐఎన్‌టీయూసీ ఇన్‌చార్జ్ గోవర్ధన్, నర్సంపల్లి నాగరాజు, రవి, ప్రవీణ్‌రెడ్డి, దినేశ్, రవితేజ తదితరులున్నారు.

పీహెచ్‌సీలో వసతుల ఏర్పాటుకు కృషి

మనోహరాబాద్(తూప్రాన్): పీహెచ్‌సీలో వసతుల ఏర్పాటుకు ప్రత్యేక దృష్టి పెట్టామని ఎంపీపీ నవనీతరవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఎంపీపీ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో అవసరమైన వసతుల గురించి చర్చించారు. డాక్టర్ జ్యోతి, తదితరులున్నారు.

బీమా చెక్కు అందజేత

చేగుంట(తూప్రాన్): మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త కుటుంబీకులకు దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి బీమా చెక్కును అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ కార్యకర్తగా ఉన్న శ్రీరాం కాశయ్య విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. అతడి పేరున కాంగ్రెస్ సభ్యత్వ బీమా ఉండటంతో రూ. 2లక్షల బీమా చెక్కును మృతుడి భార్య పెంటమ్మకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌తో తండాల అభివృద్ధి

- నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి
- ఘనంగా తండాల్లో గిరిజన దినోత్సవం



గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సునీతారెడ్డి

నర్సాపూర్ రూరల్: తెలంగాణ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్‌తోనే గిరిజన తండాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాయని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. శనివారం నర్సాపూర్ మండలంలోని నారాయణపూర్, తిరుమలపూర్, మంతూర్, రంజా తండా, మహ్మదాబాద్, అద్మాపూర్, ఎల్లారెడ్డి గూడ, తుల్జారాంపేట, గూడెం గడ్డ గ్రామాలకు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ ప్రభుత్వంలో గిరిజన తండాలు, చిన్న గ్రామాలు, గ్రామ పంచాయతీలు ఏర్పాటు కావడంతో పాటు, అన్ని రకాలుగా అభివృద్ధి చెందాయి. ప్రతీ గ్రామంలో వైకుంఠధామం, డంప్‌యార్డ్, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం, సీసీరోడ్లు, మురికి కాల్వలు నిర్మించామన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరు అయ్యాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ రాజు యాదవ్, ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, శివకుమార్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు శ్రీరాములు, సంతోష బిక్కు నాయక్, సామ్యా నాయక్, నర్సింగ్ నాయక్, వెంకటేష్‌గౌడ్, పద్మ శంకర్, సేనాధిపతి, శ్రీశైలం, బీఆర్‌ఎస్ నాయకులు హబీబ్ ఖాన్, సత్యం గౌడ్, మహమ్మద్ షరీఫ్, షేక్ హుస్సేన్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

రేగోడ్(మెదక్): మండలంలోని పెద్దతండా, సంగమేశ్వర తండా, టి.లింగంపల్లి గ్రామాల్లో గిరిజన ఉత్సవాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పెద్దతండా, సంగమేశ్వర తండాలో రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ క్రాంతికిరణ్ శంకుస్థాపన చేశారు. టి.లింగంపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ జెండాఎగురవేసి అంబేడ్కర్, బసవేశ్వరుని విగ్రహాలకు పూలమాల వేశారు. అనంతరం గ్రామానికి చెందిన 40 మంది అంబేడ్కర్ యువ జన సంఘం సభ్యులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సుగుణ, సుమంత, రవీందర్, సిద్ధారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, ఎంపీటీసీ నర్సింలు, పీఆర్ డీఈ శ్రీనివాస్, తహసీల్దార్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



రేగోడ్(మెదక్): కండువా కప్పుతున్న అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



కొల్చారం(నర్సాపూర్): మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి



శివ్వంపేట(నర్సాపూర్): రూప్లా తండాలో బోనాలతో గిరిజన మహిళలు



కౌడిపల్లి(నర్సాపూర్): కొత్తచెరువు తండాలో..



నిజాంపేట(మెదక్): నగరం తండాలో..



వెల్దుర్తి(తూప్రాన్): రామంతాపూర్ తండాలో ..



పూజల్లో గిరిజనులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): టోప్యా తండాలో..



చేగుంట(తూప్రాన్): నడిమి తండాలో..

ధ్రువపత్రాలకు సర్వర్ కష్టాలు

నర్సాపూర్: సర్వర్ సరిగా పని చేయనందున ఆయా రకాల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పెద్ద ఎత్తున దరఖాస్తులు రావడంతో సర్వర్‌పై భారం పెరిగి సరిగా పని చేయడం లేదని మీ సేవా కేంద్రాల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అల్లాదుర్గం(మెదక్): బలహీన వర్గాల కులస్తులకు ప్రభుత్వం ఆర్థికసాయం అందజేస్తుండటంతో కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకొని వారం, పది రోజులు కావస్తున్నా.. ధ్రువపత్రాలు ఇవ్వక పోవడంతో బీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లాదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.



అల్లాదుర్గం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజలు

చేగుంట(తూప్రాన్): మండల రెవెన్యూ కార్యాలయంలో ధ్రువ పత్రాల మంజూరులో సర్వర్ కష్టాలు ఏర్పడ్డాయి. వారం రోజులుగా రెవెన్యూ కార్యాలయంలో సర్వర్ పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులు, దరఖాస్తుదారులు కార్యాలయం చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారు.

మట్టి అక్రమ రవాణా అడ్డగింత



మట్టి రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలంలోని పలు గ్రామాల నుంచి మట్టి అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. మాసాయిపేట మండల కేంద్రంలోని ఓ వెంచర్‌కు శనివారం నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ **అధిక ఫీజులు అరికట్టాలి**

టేక్మాల్(మెదక్): రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు అరికట్టాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. నరేశ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన టేక్మాల్‌లో మాట్లాడుతూ... పేద విద్యార్థులకు విద్య హక్కుచట్టం ప్రకారం ప్రతీ విద్యాసంస్థలో 25 శాతం ఉచిత విద్యను అందించాలనే ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఏ పాఠశాలలో కూడా అమలు చేయడంలేదని ఆరోపించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఇందులో నాయకులు శ్రీమంత్, కార్తీక్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ముదిరాజ్‌లకు ఆర్థిక సాయం అందించాలి**

పెద్దశంకరంపేట(మెదక్): ముదిరాజ్‌కు కూడా ప్రభుత్వం వెంటనే రూ.1 లక్ష ఆర్థిక సహాయాన్ని ప్రకటించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దశాబ్ది వేడుకల్లో ముదిరాజ్‌లను ప్రభుత్వం అవమానించిందని అన్నారు. కార్యక్రమంలో మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు శ్రావణ్ ముదిరాజ్, దమ్ము సాయిలు, కృష్ణ, విశ్వనాథం తదితరులున్నారు..

◆ **సన్మానం**

చిలప్‌చెడ్(నర్సాపూర్): జిల్లా స్థాయిలో ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకున్న మండలంలోని చిటుకుల్ గ్రామ సర్పంచ్ గోపాల్‌రెడ్డిని శనివారం ఆ గ్రామ యువకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ వినోదరెడ్డి, ఎంపీడీఓ శశిప్రభ, కార్యదర్శి తిరుపతి, ఏపీఓ శ్యాంకుమార్, సొసైటీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, ఉపసర్పంచ్ సుధాకర్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

◆ **నివాళి**

టేక్మాల్(మెదక్): తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్. సాయిలు ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రం టేక్మాల్‌లో కీ.శే సాంబరాజు రవి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రజక కులస్తుల అభ్యున్నతికి ఎస్సీ రిజర్వేషన్ కోసం ఆరేళ్లుగా ఎన్నో ఉద్యమాల్లో చురుకైన పాత్రను పోషించి తెలంగాణ రజక రిజర్వేషన్ సమితిలో సాబరాజు రవి తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. రజక సంఘ సభ్యులు ఆయనను ఆదర్శంగా తీసురకొని ముందుకు సాగాలని కోరారు. మండల అధ్యక్షుడు రమేశ్, నాయకులు అంబెష్ లక్ష్మణ్, రవి, సాయి, గంగారం, తులసమ్మ, దుర్గమ్మ పాల్గొన్నారు.

◆ **ఆలయ నిర్మాణ పనుల పరిశీలన**



కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రేణుకా ఎల్లమ్మ దేవాలయ నిర్మాణ పనులను శనివారం రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి ఆలయాన్ని పరిశీలించారు. గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఆలయ నిర్మాణంపై అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో స్వామివారి వెంట సర్పంచ్ నాగరాణి, గౌడ సంఘం నాయకులు యాదవ్‌గౌడ్, దయాకర్‌గౌడ్, రాజాగౌడ్, గౌరీ శంకర్, యాదయ్య, తదితరులు ఉన్నారు.

◆ **అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం**

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని సప్తగిరి కాలనీలో శనివారం అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు సురిబాబు, వెంకటేశ్, భూపాల్, నాయకులు అలీం, జలీల్, ఎల్లేశ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

◆ **20న పాఠశాలలు ప్రారంభం**

తూప్రాన్: మన ఊరు – మనబడి కార్యక్రమంలో నూతనంగా నిర్మించిన రెండు బడులను ఈ నెల 20 ప్రారంభిస్తామని ఎంఈఓ బుచ్చానాయక్ శనివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోతరాజుపల్లి ప్రభుత్వ పాఠశాలలో సమావేశం నిర్వహించారు. మనఊరు – మన బడిలో పోతరాజుపల్లి, రావెల్లి గ్రామాల్లో నూతనంగా పాఠశాలలను నిర్మించినట్లు , ఈ నెల 20న ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో హెచ్‌ఎం మధుసూదన్‌రావు, రాజగోపాల్‌రెడ్డి, సీఆర్పీ కన్యాలాల్ పాల్గొన్నారు.

◆ **కొనసాగుతున్న దీక్షలు**

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధన కోసం రామాయంపేటలో అఖిలపక్షం ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు శనివారం 83వ రోజుకు చేరుకున్నాయి.

◆ **ఉచిత వైద్య శిబిరం**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని లింగారెడ్డిపేట్ గ్రామంలో జీఎమ్మార్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంను శనివారం నిర్వహించారు. గ్రామంలోని పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీఎమ్మార్ పోచంపల్లి ఎక్స్‌ప్రెస్ హైవే ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ, ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్, డాక్టర్ రియాజ్, సర్పంచ్ సుగుణమ్మ, బీఆర్‌ఎస్ పెంటాగౌడ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది, పారామెడికల్ రామకృష్ణ, పీఆర్‌ఓ దుర్గాప్రసాద్‌రెడ్డి, కోఆర్డినేటర్ మధు, రాజ్‌నారాయణ్, ఫౌండేషన్ సిబ్బంది తదితరులున్నారు.

◆ **నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పర్కిబండ, తుపాకులపల్లి, గౌతోజీగూడెం గ్రామాల్లో విద్యుత్ మరమ్మతుల కోసం విద్యుత్ సరఫరాలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అంతరాయం కలగనుందని ఏఈ కృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు.

◆ **భగీరథ పైప్‌లైన్‌కి మరమ్మతులు**

నర్సాపూర్ రూరల్: దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంచినీళ్ల పండగకు ఒక రోజు ముందు శనివారం మండలంలోని రెడ్డిపల్లి సమీపంలో భగీరథ పైపు లైన్కు పెద్ద ఎత్తున లీకేజీ ఏర్పడి మంచినీరు పెద్ద ఎత్తున వృథాగా పోయింది. ఇది గమనించిన నర్సాపూర్ మండల ఉప సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు అశోక్‌గౌడ్ భగీరథ అధికారులకు సమాచారం ఇచ్చి దగ్గరుండి లీకేజీకి మరమ్మతులు చేయించారు.

◆ **అంతిమయాత్రలో ఎమ్మెల్యే**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని అంబాజీపేట గ్రామ బీఆర్‌ఎస్ కార్యకర్త వడ్ల దుర్గపతి మృతి చెందగా మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజు, సర్పంచ్ సాయిలు తదితరులు ఉన్నారు.

◆ **'దశాబ్ది ఉత్సవాల పేరుతో డబ్బులు వృథా'**

చిన్నశంకరంపేట(మెదక్): రైతులకు ధాన్యం డబ్బులు ఇవ్వకుండా దశాబ్ది ఉత్సవాల పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబ్బులు వృథా చేస్తుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోతరాజ్ రమణ విమర్శించారు. శనివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

◆ **ఓం ఫాజిల్ నగర్ ఉత్సవాలు**

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని గంగాయిపల్లిలో కొలువైన ఓం ఫాజిల్‌నగర్ అప్పగారి ఆశ్రమ అర్ధ సంవత్సర ఆరాధన ఉత్సవాలకు ముస్తాబైంది. ఆదివారం ఆరాధన కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు నసిరొద్దీన్ చిష్తి తెలిపారు.

సేవాలాల్ జయంతిని అధికారికంగా చేస్తున్నాం



కామారం తండాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): రాష్ట్రంలో గిరిజనుల ఆరాధ్యగురువు సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నమని, గిరిజన తండాల అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం అయిందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం చిన్నశంకరంపేట మండలం కామారంతండా, మిర్జాపల్లితండా, ఖాజాపూర్ తండాల్లో గిరిజన దినోత్సవం సందర్భంగా నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజన తండాలు ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడడంతో గిరిజనులలో ఆత్మగౌరవం పెరిగిందన్నారు. గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ కోసం సీఎ కేసీఆర్ కృషి చేశారన్నారు. గిరిజనుల ఆరాధ్యగురువు సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ అని అన్నారు. కార్యక్రమంలో కామారంతండా, మిర్జాపల్లితండా, ఖాజాపూర్ తండాల సర్పంచ్‌లు లక్ష్మీరాములు, బుజ్జమ్మ, జంకుభాయి, సర్పంచ్‌లు పూలపల్లి యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు యాదగిరి, సక్కుబాయి, పీఏసీఎస్ చైర్మన్‌లు అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

అల్లాదుర్గం(మెదక్): ఈ నెల 14న ‘సాక్షి’ దినపత్రికలో పొదల మధ్యన పశువుల ఆస్పత్రి అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. అల్లాదుర్గం పశువుల ఆస్పత్రి చుట్టూ పొదలు వెలిసి పశువుల చికిత్సకు ఇబ్బందిగా మారింది. ఈ ఘటనపై ‘సాక్షి’ పూర్తి వివరాలతో వార్త ప్రచురించింది. ఈ వార్తకు స్పందించిన పశువైద్య సిబ్బంది ఆస్పత్రి చుట్టూ ఉన్న పొదలు తొలగించారు.



అల్లాదుర్గం పశువుల ఆస్పత్రి చుట్టూ పొదలు తొలగించిన దృశ్యం

పనులు వేగవంతం చేయాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని అజ్జమర్రి ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న మన ఊరు – మన బడి పనులను వేగవంతం చేయాలని నోడల్ అధికారి విఠల్ అన్నారు. శనివారం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పాఠశాల పనులు చురుగ్గా కొనసాగుతున్నాయన్నారు. నిరంతరం పనులను పర్యవేక్షిస్తూ, త్వరగా పనులు జరిగేలా చర్యలు తీసుకున్న సర్పంచ్ పరశురాంరెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ వీరాస్వామి పనితీరు హర్షనీయమన్నారు. సుమారుగా 95 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. మంగళవారం పాఠశాల ప్రారంభోత్సవం నాటికి వందశాతం పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నరేశ్, సిబ్బంది కనకయ్య, మదర్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న నోడల్ అధికారి విఠల్

దాతల సహాయం వెలకట్టలేనిది



శివ్వంపేట(నర్సాపూర్): నోట్ పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం



నర్సాపూర్ రూరల్: నాగులపల్లిలో..

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం దాతలు అందిస్తున్న సహాయం వెలకట్టలేనిదని గంగాయిపల్లి సర్పంచ్ శ్యామల, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పవన్‌గుప్తా అన్నారు. శనివారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులందరికీ హైదరాబాద్‌కు చెందిన గాలి భిక్షపతి నోట్ పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంతోష్ పాల్గొన్నారు.

నర్సాపూర్ రూరల్: మండలంలోని నాగులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఉచితంగా శనివారం హైదరాబాద్ రామచంద్రపురంకు చెందిన దాతలు రాజేశ్వర్ గుప్తా, రిటైర్డ్ హెచ్‌ఎం ప్రతాప్ రెడ్డి, చంద్రశేఖర్ గుప్తా, నాగేంద్ర గుప్తా ఆధ్వర్యంలో సుమారు 40 వేల విలువ చేసే నోట్‌బుక్స్, అభ్యసన సామగ్రి విద్యార్థులకు అందజేశారు.

ఆలయాల్లో భక్తుల పూజలు

నర్సాపూర్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజాలు చేశామని ఆలయ అర్చకుడు హరిప్రసాద్ శర్మ చెప్పారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందండి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సత్యనారాయణస్వామి మండపంలో భక్తులు సామూహిక వ్రతాలు ఆచరించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, శ్రీవాత్సవ్‌శర్మ, సిబ్బంది శ్రీనివాస్, రామకృష్ణ ఉన్నారు.




శివ్వంపేట(నర్సాపూర్): ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని బాలవీర హనుమాన్ ఆలయంలో శనివారం ఆలయ అర్చకుడు మెట్టురాజుములు శర్మ స్వామివారికి చందనాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు అన్నదానం నిర్వహించారు.

కౌడిపల్లిలో ముగ్గుల పోటీలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కిషన్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆదివారం నీళ్ల పండగ భగీరథ కార్యక్రమం ఉండగా కౌడిపల్లిలో ముందస్తుగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తాగునీరు నాడు, నేడు, హరితహారం, తదితర ముగ్గులు వేశారు. కార్యక్రమంలో ఏఈలు అరవింద్, ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, ఏపీఎం సంగమేశ్వర్, అంగన్‌వాడీ టీచర్లు, డ్వాక్రా మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ముగ్గులను పరిశీలిస్తున్న అధికారులు

ఖేడ్‌లో అభివృద్ధి కనిపించడం లేదా?

పెద్దశంకరంపేట(మెదక్): ఖేడ్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి చేసిన అభివృద్ధి కాంగ్రెస్ నాయకులకు కనిపించడం లేదా అని ఎంపీపీ శ్రీనివాస్ అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రహదారులు, సీసీ రోడ్లు, విద్యా, వైద్య రంగాలతో పాటు రైతులకు ఇబ్బందులు దూరం చేసేందుకు జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, ఎంపీటీసీలు దత్తు, వీణసుభాష్‌గౌడ్, సర్పంచ్ రాములు, రైతుబంధు అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, నాయకులు అశోక్, సూర్యప్రకాశ్, పున్నయ్య, శ్రీశైలం, మానిక్యం, వెంకయ్య, గంగారాం తదితరులున్నారు.